వైకుంఠధామాల్లో వసతులు కరువు

- నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం
- ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు
- సౌకర్యాలు కల్పించాలని వినతి


14వ డివిజన్ లక్ష్మీపురంలోని వైకుంఠధామం

ఫెర్టిలైజర్‌సిటీ: ప్రతి గ్రామానికి అన్ని వసతులతో కూడిన వైకుంఠధామాలు ఉండాలన్న లక్ష్యంతో నిర్మాణం చేపట్టింది. ఇప్పటికే జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 90శాతం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. కానీ రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ లక్ష్మీపురంలో వైకుంఠధామం నిర్మాణ పనులు ప్రారంభించి మూడేళ్లవుతోంది. నిర్మాణ పనులు కొంతమేర పూర్తి చేసి వదిలేశారు.

సౌకర్యాలు కల్పించాలి..

లక్ష్మీపురం గ్రామంలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన వైకుంఠధామంలో స్నానాలు చేసేందుకు బోర్, ఇతర సౌకర్యాలు లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్పొరేషన్ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతోనే నిర్మాణ పనులు జరగడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లక్ష్మీపురం వైకుంఠధామంలో నీటి సౌకర్యం, మహిళల కోసం స్నానాలకు షెడ్లు నిర్మించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం..

రామగుండం కార్పొరేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో వైకుంఠధామాల నిర్మాణం కోసం నిధులు కేటాయించలేదు. గోదావరిఖని గోదావరి నది ఒడ్డున గల హిందూ శ్మశానవాటిక, ఫైవింక్లయిన్ ఏరియాలో ముస్లింల శ్మశానవాటిక, గోదావరిఖని బస్టాండ్ ఎదుట క్రిస్టియన్ శ్మశానవాటికలు ఉన్నాయి. కార్పొరేషన్ పరిధిలోని గ్రామాల ప్రజలు వీటిని వినియోగించుకునేందుకు దూరం ఎక్కువగా ఉండడంతో కార్పొరేషన్ పరిధిలోని గ్రామీణ ప్రాంతాల వారు రాలేకపోతున్నారు. కార్పొరేషన్ పరిధిలోని లక్ష్మీపురం, వీర్లపల్లి, న్యూమారేడుపాక శ్మశాన వాటికలకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిధులు కేటాయించాలని గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



లక్ష్మీపురం గ్రామంలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న వైకుంఠధామం నిర్మాణ పనులు మూడేళ్లు గడిచినా ముందుకు కదలడం లేదు. కార్పొరేషన్‌లో ఉండడమే మా గ్రామానికి శాపంగా మారింది. అధికారులు స్పందించి లక్ష్మీపురం గ్రామంలో ఏర్పాటు చేసిన శ్మశాన వాటికలో స్నానాల కోసం బోరు బావి ఏర్పాటు చేయాలి. మహిళలకు స్నానపు గదులు నిర్మించాలి.

– బుర్ల శ్రీనివాస్, లక్ష్మీపురం కొత్తగేట్

పట్టించుకోవడం లేదు



వైకుంఠధామాల నిర్మాణం గురించి అధికారులు పట్టించుకోవడం లేదు. లక్ష్మీపురం గ్రామంలో వైకుంఠధామ నిర్మాణం చేపట్టి వదిలేశారు. దీంతో గ్రామంలో అంత్యక్రియలకు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అధికారులు పట్టించుకొని నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలి.

– తాటికొండ రాజబాబు, లక్ష్మీపురం

నిధులు కేటాయించాలి



కార్పొరేషన్ ఆధ్వర్యంలో లక్ష్మీపురం వైకుంఠధామానికి నిధులు కేటాయించకపోవడంతో నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. లక్ష్మీపురం గ్రామంలో నిర్మించిన వైకుంఠధామానికి కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిధులు కేటాయించేలా అధికారులు చర్యలు చేపట్టాలి. మౌలిక వస్తువులు కల్పించాలి.

– కాంపల్లి రఘుబాబు, లక్ష్మీపురం కొత్తగేట్

క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

పాలకుర్తి: సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు, కొత్తపల్లి మాజీ సర్పంచు మల్లెత్తుల శ్రీనివాస్ శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్‌లో పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం శ్రీనివాస్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. జయ్యారం ఎంపీటీసీ గంగాధర రమేశ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య, దేవనందుల రాజమౌళి, తలారీ శంకర్ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం


పతాకావిష్కరణలో పీఆర్‌టీయూ నాయకులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని ప్రభుత్వ జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్‌లో పీఆర్‌టీయూ(తెలంగాణ) ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. రామగుండం మండల అధ్యక్షుడు రాపోలు జనార్దన్‌రావు కార్యక్రమానికి అధ్యక్షత వహించి జెండా ఆవిష్కరించారు. మహిళా అసోసియేట్ అధ్యక్షురాలు వెంకటలక్ష్మిని సన్మానించారు. కార్యక్రమంలో సంఘం సీనియర్ కార్యకర్తలు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు దాసరి రఘు, బొంతల సతీశ్‌బాబు, రామగుండం మండల ప్రధాన కార్యదర్శి రవి, రామన్న, శ్రీనివాస్, ప్రేమ్‌కుమార్, గోపికృష్ణ, సూర్యనారాయణ, రవీందర్, చంద్రశేఖర్, రమేశ్, అంజన్‌కుమార్, శ్రీధర్, రమేశ్, రాథోడ్ సంతోష్, శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

'బిరుదు' కుటుంబానికి పరామర్శ


నివాళి అర్పిస్తున్న చాడ వెంకటరెడ్డి

సుల్తానాబాద్: పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. వారి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి శుక్రవారం సుల్తానాబాద్‌లోని వారి గృహంలో పరామర్శించారు. బిరుదు రాజమల్లు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, మండల కార్యదర్శి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి సునీల్, సీపీఐ కరీంనగర్ జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు బూడిద సదాశివ, నాయకులు పసుల మల్లారెడ్డి, శంకర్‌గౌడ్, గణేశ్ ఉన్నారు.

రుణాలు వసూలు చేయాలి

జూలపల్లి: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో రైతులకు ఇచ్చిన రుణాల వసూళ్లలో వందశాతం లక్ష్యం సాధించాలని సహకార సంఘం చైర్మన్ కొంజెర్ల వెంకటయ్య సూచించారు. మండల కేంద్రంలోని సంఘ సమావేశ మందిరంలో చైర్మన్ అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణాల రికవరీతో పాటు రైతులకు అందుబాటులో ఉండేలా కుమ్మరికుంటలో ఎరువుల గోదాం నిర్మించేందుకు స్థలం కొనుగోలు చేయాలని, జూలపల్లిలో ఇప్పుడు ఉన్న గోదాంను విస్తరించాలని తీర్మానించారు. ఉపాధ్యక్షుడు ముత్తు లింగం, డైరెక్టర్లు గుమ్మడి శంకరయ్య, గడ్డం నర్సింహారెడ్డి, ఐలయ్య, బీరయ్య పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

జ్యోతినగర్: కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా 16 చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ అనుబంధ ఎన్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ కన్వీనర్ గీట్ల లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌లో ఆటో యూనియన్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కారణంగా ఆటో డ్రైవర్లు జీవనోపాధి కోల్పోతున్నారని వాపోయారు. ఆటోడ్రైవర్లకు ఆర్థికసాయంతో పాటు ప్రత్యామ్నాయం చూపించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మె, భారత్ బంద్‌లో ఆటో డ్రైవర్లు, ఓనర్లు కార్మికులు, రవాణా రంగ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.భిక్షపతి, ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

11న బైక్ ర్యాలీ విజయవంతం చేయండి


మాట్లాడుతున్న రైతు కూలీ సంఘం ప్రతినిధులు

రామగుండం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా 11వ తేదీన ఐఎఫ్‌టీయూ–ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం అంతర్గాం మండల కేంద్రంలో అఖిల భారత రైతు కూలీ సంఘం ప్రతినిధులు విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్గాం మండల కేంద్రం నుంచి బైక్ ర్యాలీగా రామగుండం అంబేడ్కర్ చౌరస్తా, ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్, జీడీకే చౌరస్తా, యైటింక్లయిన్‌కాలనీ, సెంటినరీకాలనీ వరకు కొనసాగుతుందన్నారు. దీనికి అధిక సంఖ్యలో అన్నిరంగాల్లో ఉన్న కార్మికులు, కర్షకులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సంఘం ప్రతినిధులు మేర్గు చంద్రయ్య, కొల్లూరి మల్లేశ్, వేల్పుల సాంబయ్య, రాజకొమురయ్య, రమేశ్ ఉన్నారు.

పెండింగ్ వేతనాలివ్వండి


నిరసన వ్యక్తం చేస్తున్న ఆశావర్కర్లు

పెద్దపల్లిరూరల్: ఆశావర్కర్లకు చెల్లించాల్సిన పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని, అభయహస్తం, గృహలక్ష్మి తదితర పనుల నుంచి ఆశావర్కర్లకు మినహాయింపు ఇవ్వాలంటూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఆశావర్కర్లకు రూ.18వేల వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతి డిమాండ్ చేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీకి వినతిపత్రం అందించారు. ఆశావర్కర్లకు సకాలంలో వేతనాలందక అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. నాయకులు రవీందర్, రజిత, శివలీల, సువర్ణ, స్వప్న, శోభ, జ్యోతి, రజిత, మంజుల, పద్మ, రాజేశ్వరి ఉన్నారు.

ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌కు ఐపీఎస్ విద్యార్థులు

సుల్తానాబాద్: ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్ సెకండ్ లెవెల్ ఎగ్జామ్‌కు ఐపీఎస్ పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమని పాఠశాల డైరెక్టర్ మాటేటి సంజీవ్ కుమార్ కొనియాడారు. శుక్రవారం ఐపీఎస్ విద్యార్థులు ఎంపికవ్వడంతో వారిని అభినందించారు. 11న కరీంనగర్‌లో జరగనున్న ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలంపియాడ్ సెకండ్ లెవెల్ ఎగ్జామ్‌లో పాల్గొంటారని తెలిపారు. ప్రిన్సిపాల్ కృష్ణప్రియ, మ్యాథ్స్ ఉపాధ్యాయులు కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

12న సదరం స్లాట్ బుకింగ్

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని దివ్యాంగుల వైద్య నిర్ధారణ పరీక్షలకు 12న మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ చేసుకోవాలని డీఆర్‌డీవో శ్రీధర్ కోరారు. సదరం సర్టిఫికెట్ రెన్యువల్, కొత్తగా నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల15న, మార్చి 14న దృష్టిలోపం ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే మానసిక వైకల్యం, బుద్ధిమాంద్యం గల వారికి ఈ నెల 22న, మార్చి 21న, వినికిడి లోపం గల వారు ఈనెల 29, మార్చి 28న స్లాట్ బుకింగ్ చేసుకోవాలని వివరించారు. శిబిరాలకు వచ్చేటప్పుడు దివ్యాంగత్వ పరీక్ష కాపీ, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, వ్యక్తిగత మెడికల్ రిపోర్టు వెంట తెచ్చుకోవాలని పేర్కొన్నారు.

ఆలయంలో అష్టకోటి లలిత సహస్రనామం

గోదావరిఖనిటౌన్: మాఘ మాసం సందర్భంగా స్థానిక పవర్‌హౌస్ కాలనీలోని దుర్గాదేవి ఆలయంలో 12న అష్టకోటి లలిత సహస్రనామ పారాయణ సంపూర్ణం పురస్కరించుకుని ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 7 వరకు లలిత సహస్రనామ అఖండ పారాయణం, 13న మంగళవారం అభిషేకం, కోటి లలిత సహస్రనామ పారాయణం సంపూర్ణ కార్యక్రమం నిర్వహిస్తారు. అనంతరం పురోహితులకు సత్కారం ఉంటుందని తెలిపారు.

నేడు విద్యుత్ అధికారుల పర్యటన

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ 3, 5వ డివిజన్లకు సంబంధించిన గృహజ్యోతి లబ్ధిదారుల వివరాల సేకరణకు విద్యుత్ అధికారులు శనివారం రానున్నట్లు డీసీసీ అధికార ప్రతినిధి వెంగల బాపు ఒక ప్రకటనలో తెలిపారు. 3వ డివిజన్‌లోని జంగాలపల్లె, బి-గేట్, 5వ డివిజన్‌లోని మల్కాపూర్, రామయ్యపల్లె, నర్రాశాలపల్లెకు చెందిన లబ్ధిదారులు నర్రాశాలపల్లెలోని అంబేడ్కర్ భవన్‌లో పూర్తి వివరాలతో హాజరుకావాలని సూచించారు.

ప్రభుత్వ హామీని అమలు చేయాలి

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయాలని ఆశావర్కర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లావ్యాప్తంగా పలువురు అధికారులకు వినతిపత్రం అందజేశారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

రామగిరి: ప్రభుత్వ కళాశాల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని మంథని బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ సలీం అన్నారు. శుక్రవారం మండలంలోని నాగెపల్లి, బేగంపేట ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులతో సమావేశమయ్యారు.

మూడోరోజు పారిశుధ్య కార్యక్రమాలు

ఎలిగేడు: మండలంలో శుక్రవారం గ్రామ, గ్రామాన 3వరోజు ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా పారిశుధ్య పనులను చేపట్టారు. ఆయా గ్రామాల్లో ప్రత్యేక అధికారులు మండల స్థాయి అధికారులు పరిశీలించారు. ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఎంపీవో అనిల్‌రెడ్డి, తహసీల్దార్ స్వర్ణ, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికలు, బాలుర హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, సామగ్రి డాక్టర్ విజయ అందజేశారు. శుక్రవారం శ్రీవాణి విద్యా సంస్థల వ్యవస్థాపకుడు రేకులపల్లి విజయకుమార్ జయంతి సందర్భంగా విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, ఇతర పరీక్ష సామగ్రి అందజేసినట్లు ఆయన సతీమణి డాక్టర్ రేకులపల్లి విజయ తెలిపారు.

విద్యార్థులకు అభినందన

కమాన్‌పూర్: అబాకస్ పరీక్షలో ప్రతిభ కనబర్చి బహుమతి సాధించిన మండల కేంద్రంలోని ఆపిల్ కిడ్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులను శుక్రవారం కమాన్‌పూర్ లయిన్స్ క్లబ్ అధ్యక్షులు సానా రామకృష్ణరెడ్డి అభినందించారు.

రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలకు ఎంపిక

జూలపల్లి: మండల కేంద్రంలోని జూపిటర్ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి అబాకస్, వేదిక్ మ్యాథ్స్ పోటీలకు ఎంపికయ్యారు. గురువారం ఉమ్మడి జిల్లా కేంద్రంలో విశ్వం స్కూల్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన అబాకస్, వేదిక్ మ్యాథ్స్ పోటీల్లో జూపిటర్ నుంచి ఆరుగురు విద్యార్థులు ప్రతిభ కనబర్చి ఎంపికయ్యారు.

అవార్డు మరింత బాధ్యత పెంచింది


అవార్డు అందుకుంటున్న డాక్టర్

ఎలిగేడు: అవార్డు రావడం మరింత బాధ్యత పెంచిందని డాక్టర్ నిస్సీ క్రిస్టీనా అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు ఆమె తెలిపారు. ఈ అవార్డు రావడానికి సహకరించిన అధికారులకు, అనధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

లబ్ధిదారుల వివరాలు నమోదు చేయాలి


పరిశీలిస్తున్న ఆర్డీవో మధుమోహన్

సుల్తానాబాద్‌రూరల్: ప్రభుత్వం చేపట్టిన మహాలక్ష్మి పథకంలో లబ్ధిదారుల వివరాలను పక్కాగా నమోదు చేయాలని ఆర్డీవో మధుమోహన్ అధికారులను ఆదేశించారు. మండలంలోని అల్లీపూర్, రేగడిమద్దికుంట గ్రామాల్లో మహాలక్ష్మి పథకం కింద దరఖాస్తు చేసుకోగా సరిగ్గా వివరాలు లేని లబ్ధిదారుల వివరాలను సేకరిస్తున్నారు. కాగా శుక్రవారం ఈ పక్రియను ఆర్డీవో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారుల వివరాలు, గ్యాస్ కనెక్షన్, డీలర్ వివరాలను సేకరించి యాప్‌లో నమోదు చేయాలన్నారు. దరఖాస్తులో గ్యాస్ కనెక్షన్ తప్పుగా ఉన్న వారి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించాలన్నారు. తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

డ్రైనేజీలో ప్లాస్టిక్ కవర్లు వేయొద్దు


పనులను పర్యవేక్షిస్తున్న కౌన్సిలర్

పెద్దపల్లి రూరల్: డ్రైనేజీల్లో చెత్త, చెదారం, ప్లాస్టిక్ కవర్లు వేయొద్దని 8వ వార్డు కౌన్సిలర్ బొంకూరి భాగ్యలక్ష్మి అన్నారు. ప్రతి శుక్రవారం నిర్వహించే స్వచ్ఛత పరిశుభ్రత కార్యక్రమం పనులను ఆయన పరిశీలించారు. డ్రైనేజీల్లో పాలిథిన్ కవర్లతో పాటు కొబ్బరిబోండాలు వేయడంతో ఇబ్బందులు తలెత్తున్నాయన్నారు. ఇంటి వద్దకు వచ్చే పారిశుధ్య కార్మికులకు తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించి సహకరించాలని కోరారు. సిబ్బంది రాజు, కరుణాకర్, ఎల్లమ్మ, భూమయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

పన్ను వసూళ్లపై స్పెషల్ డ్రైవ్


చెల్లించిన బిల్లుకు రశీదు అందజేస్తున్న అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ పరిధిలో ఇంటి పన్నులు, నల్లా బిల్లు, ట్రేడ్ లైసెన్స్ తదితర పన్నుల వసూళ్ల శాతం పెంచేందుకు మున్సిపల్ అధికారులు సిబ్బందితో కలిసి శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. యైటింక్లయిన్‌కాలనీ 15, 16, 17, 18, 19 డివిజన్ ఏరియాల్లో ఇంటింటా తిరుగుతూ ఎక్కువ బకాయిలు ఉన్న వారి వద్ద నుంచి పన్నులు వసూలు చేశారు. ఆర్ఐ శంకర్‌రావు మాట్లాడుతూ పన్ను బకాయిలు ఉన్నవారు వెంటనే పన్నులు చెల్లించి కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కరుణాకర్, సూపర్‌వైజర్ అడప సోమేష్, బిల్ కలెక్టర్ భవానీ ప్రసాద్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

జ్యోతినగర్: రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్ పోటీలకు ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని సెయింట్ క్లేర్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు శుక్రవారం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ కొమ్ము గట్టయ్య తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రకాష్ స్టేడియంలో 10న జరగనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు అండర్ 8లో గణేశ్(50 మీటర్ల పరుగు), అండర్–12లో డి.అక్షిత(100 మీటర్లు), కోడెం అశ్విత్(లాంగ్‌జంప్), అండర్–14లో నిశిత (400 మీటర్ల పరుగు), సాత్విక్‌రెడ్డి (100 మీటర్ల పరుగు) ఎంపికయ్యారు. విద్యార్థులను హెచ్‌ఎం ఫాదర్ డామినిక్, వ్యాయామ ఉపాధ్యాయులు సుదేష్ అభినందించారు.

పెద్దపల్లి జెడ్పీస్కూల్ విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు వర్షిణి, కావేరి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఎంఈవో సురేంద్రకుమార్ తెలిపారు. ఈనెల 4న కరీంనగర్‌లో జరిగిన జిల్లాస్థాయి షాట్‌పుట్, రన్నింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. ఎంపికైన విద్యార్థులు శనివారం (10న) కొత్తగూడెంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

గణితంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు భవిష్యత్


మాట్లాడుతున్న డీఈవో మాధవి

ముత్తారం: గణితంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని జిల్లా విద్యాధికారి డి.మాధవి అన్నారు. శుక్రవారం ముత్తారం జెడ్పీ పాఠశాలలో జరుగుతున్న గణితం స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆమె మాట్లాడారు. పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధతో తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎండీ షేక్, ఎంఎస్‌వో ఓదెలు, రిసోర్స్ పర్సన్లు భరత్‌రెడ్డి, శ్రీధర్‌రావు, మల్లేశ్వర్‌రావు, లక్ష్మణ్, సమ్మయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో వేలం


ఆలయంలో వేలం నిర్వహణ

ఓదెల: జిల్లాలో ప్రముఖ దేవస్థానం ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో శుక్రవారం వేలం నిర్వహించారు. ఈవో సదయ్య, వైస్‌చైర్మన్ బత్తుల రమేశ్‌బాబు అధ్యక్షతన వేలం నిర్వహించారు. జాతరలో కొబ్బరికాయలు విక్రయించడానికి ఓదెల గ్రామానికి చెందిన పచ్చిమట్ల సునీల్ రూ.5.29లక్షలు, పూలకు ఓదెల గ్రామానికి చెందిన చింతం రాజయ్య రూ4.65లక్షలు, కొబ్బరి ముక్కలు సేకరించటం కోసం నాంసానిపల్లె గ్రామానికి చెందిన నేదూరి బాలయ్య రూ1.72లక్షలు, శీతల పానీయాలు అమ్మడానికి ఓదెల గ్రామానికి చెందిన మాటేటి సందీప్ రూ1.65లక్షలకు కైవసం చేసుకున్నారు. పెద్దపల్లి ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సుజాత, జూనియర్ అసిస్టెంట్ ముద్దసాని కుమారస్వామి, పాలకవర్గ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పదవీకాలం ముగిసిన ప్రజాప్రతినిధులకు సన్మానం


రామగిరి: సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు


పాలకుర్తి: మాజీ సర్పంచులకు సన్మానం

రామగిరి: ఇటీవల పదవీకాలం పూర్తయిన మండలంలోని కాంగ్రెస్‌కు చెందిన ప్రజాప్రతినిధులను మండల అధ్యక్షుడు రొడ్డ బాపు అధ్యక్షతన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతియాదవ్ సన్మానించారు. సెంటినరీకాలనీ శ్రీపాద భవన్‌లో కల్వచర్ల, బుధవారంపేట, ముస్త్యాల సర్పంచ్‌లు గంట పద్మ, దేవునూరి రజిత, రామగిరి లావణ్య, కల్వచర్ల, బుధవారంపేట, లద్నాపూర్ ఉపసర్పంచ్‌లు వేము కనకయ్య, మొగిళి నరేశ్, తోట్ల మధునయ్యను సన్మానించారు. జిల్లా ఉపాధ్యక్షుడు తోట చంద్రయ్య, మండల ప్రచార కమిటీ చైర్మన్ ముస్త్యాల శ్రీనివాస్, నాయకులు వనం రాంచందర్‌రావు, ఎల్లె రామ్మూర్తి, కాటం సత్యం, కొప్పుల గణపతి, బర్ల శ్రీనివాస్, తీగల సమ్మయ్య, బండారి సదానందం, కొరుకొప్పుల తులసీరాంగౌడ్ పాల్గొన్నారు.

పాలకుర్తి మండల పరిధిలో..

పాలకుర్తి: మండల పరిధిలోని గ్రామాల్లో పదవీకాలం పూర్తయిన సర్పంచులను శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి సన్మానించారు. పాలకుర్తి గ్రామ రైతువేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ వ్యాళ్ల అనసూర్య, వైస్ ఎంపీపీ ఎర్రం స్వామి, ఎంపీవో షబ్బీర్‌పాషా, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాస్‌తో పాటు ఆమె పాల్గొని సర్పంచులను సత్కరించి జ్ఞాపిక బహూకరించారు. ఎంపీవో షబ్బీర్‌పాషా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు దుర్గం జగన్, శేర్ల లక్ష్మీపతి, గోంద్ర చందర్, గంధం లక్ష్మీనారాయణ, కొప్పు పుష్పలత, చింతకింది నర్సమ్మ, రావుల శారద, ఆడెపు శ్రీనివాస్, కన్నాల ఎంపీటీసీ అతిఖ్, నాయకులు మల్క రామస్వామి, చిట్టబోయిన రాజ్‌కుమార్, వ్యాళ్ల రాంరెడ్డి పాల్గొన్నారు.

ఓదెల మల్లన్న చైర్మన్‌కు మాతృవియోగం

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానం చైర్మన్ మేకల మల్లేశంయాదవ్ తల్లి మేకల లక్ష్మి(86) శుక్రవారం స్వగ్రామమైన ధర్మారం మండలం రాజారాంపల్లెలో మృతిచెందింది. చైర్మన్‌ను పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు పరామర్శించారు. శనివారం ఉదయం అంత్యక్రియలు రాజారాంపల్లెలో జరుగుతాయని దేవస్థానం వైస్‌చైర్మన్ బత్తుల రమేశ్‌బాబు తెలిపారు.

జాతర పోస్టర్ ఆవిష్కరణ

పెద్దపల్లిరూరల్: మండలంలోని తుర్కలమద్దికుంటలో సమ్మక్క–సారలమ్మ జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని జాతర కమిటీ అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ ముత్యాల రాజయ్య తెలిపారు. జాతర ప్రాంగణంలో శుక్రవారం జాతర ఉత్సవాల నిర్వహణ పోస్టర్‌ను కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలతో కలిసి ఆవిష్కరించారు. నాయకులు సంపత్‌రెడ్డి, భూమయ్య, లక్ష్మయ్య, స్వామి, మొండయ్య, ఐలయ్య, శ్రీనివాస్, స్వామి ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

రామగిరి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని మంథని సీఐ బొల్లపెల్లి రాజు సూచించారు. శుక్రవారం మండలంలోని బుధవారంపేట గ్రామంలో రామగుండం పోలీస్ కమిషనరేట్ కళాబృందం ఆధ్వర్యంలో సైబర్ నేరాల నియంత్రణపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై కటికె రవిప్రసాద్, ఎంపీపీ ఆరెల్లి దేవక్క, మాజీ సర్పంచ్ దేవునూరి రజిత, మాజీ ఉప సర్పంచ్ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

ఓదెల: ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్, నాంసానిపల్లె స్పెషల్ అధికారి యాకన్న సూచించారు. శుక్రవారం మండలంలోని లంబాడితండాలో ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. పని ప్రదేశాల్లో కూలీలకు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆవుల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ గుగులోతు లక్ష్మి వస్తంనాయక్ పాల్గొన్నారు.